ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



లాలాపేట: సీతారామాంజనేయ భజన సమాజం ఆధ్వర్యంలో శనివారం లాలాపేటలోని భజన సమాజం హాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతిమా హాస్పిటల్, సాయి నేత్రాలయం, స్పార్క్ లెస్ డెంటల్ హాస్పిటల్‌బ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. భజన సమాజం పాలకమండలి అధ్యక్షులు యం పోచయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



సనత్‌నగర్: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరమని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. జెక్‌కాలనీ రోడ్ నెంబర్-1లోని ఎస్‌వీఎస్‌ఎస్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ వివిధ పనులపై వెళ్లేవారికి ఉపశమనం కలిగించేలా చలివేంద్రాలు ఏర్పాటుచేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో జెక్ కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, సెక్రటరీ రాజశేఖర్‌చందు, వెంకట్ సోమ, లక్ష్మణ్, లక్ష్మణ్‌రావు, సురేష్‌చౌదరి, సంపత్‌కుమార్, సునీల్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ పట్ల యువత అమితాసక్తి

కంటోన్మెంట్: ఫ్యాషన్ లైఫ్ యువతకు హాబీగా మారిందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం బోయిన్ పల్లి లోని గాయత్రి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన క్లాసీ క్లోసెట్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ లో వెరైటీ డ్రెస్సులు, జ్యూవెల్లరీ, హోం మేడ్ వంటకాలు, ఆర్గానిక్ కూరగాయలు, పండ్లతో కూడిన సుమారు 66 స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. స్టాల్స్ అన్నింటిని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తిరిగి పరిశీలించారు.

చదువుకు ఆర్థిక సాయం..



ఆర్థిక సహాయ చెక్కును శ్రీతేజకు అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: బీటెక్ చదువుతున్న నిరుపేద విద్యార్థినికి బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అండగా నిలిచారు. సనత్‌నగర్‌కు చెందిన మణి ముదిరాజ్, శివరాణి దంపతుల కుమార్తె శ్రీతేజ ఎన్‌ఐటీలో బీటెక్ సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వార్షిక ఫీజు చెల్లించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం వెల్లాల రామ్మోహన్ దృష్టికి రాగా ఆయన ప్రతిభావంతురాలైన పేద విద్యార్థిని చదువు ఆగకూడదని రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. శనివారం సనత్‌నగర్‌లోని కార్యాలయంలో చెక్కును వారికి అందించారు.

వామపక్ష విద్యార్థి నేతల రాజ్యాంగ పఠనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ అధికారులు జారీ చేసిన నిషేధాజ్ఞల సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని వామపక్ష విద్యార్థి నేతలు నిరసన తెలిపారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట నల్ల రిబ్బన్లను ధరించి రాజ్యాంగాన్ని పఠించారు. ఆర్టికల్ 19 (ఏ) ద్వారా లభించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు.

వర్షం ధాటికి కూలిన స్లాబ్..

అడ్డగుట్ట: డివిజన్‌లోని సీ సెక్షన్‌లో శుక్రవారం మధ్యరాత్రి కురిసిన వర్షానికి ఓ ఇంటి స్లాబ్ కూలడంతో నిర్వాసితులకు స్వల్ప గాయాలయ్యాయి. సీ సెక్షన్‌లో హౌసింగ్ సొసైటీ కింద గతంలో నిర్మించిన ఓ భవనం మొదటి అంతస్థు పైకప్పు వర్షం దాటికి కూలింది. ఈ క్రమంలో ఇంట్లో నిద్రిస్తున్న కృష్ణవేణితో పాటు ఆమె పిల్లలపై పెచ్చులూడి పడడంతో స్వల్పంగా గాయపడ్డారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

గాలి వాన బీభత్సం

బంజారాహిల్స్: గాలి వాన బీభత్సానికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ రహదారులన్నీ జలమయం అయ్యాయి. శుక్రవారం అర్ధ రాత్రి కురిసిన వానధాటికి రోడ్లపై భారీగా వరద నీరు నిలిపోవడంతో వరద నీటి కాల్వల వద్ద ఇరుక్కుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి వరద నీరు పోయే జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు చర్యలు తీసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.5లోని దేవరకొండ బస్తీలో వరద దాటికి బస్తీలోని ప్రధాన రోడ్డు మొత్తం బురదమయంగా తయారైంది.

అకాల వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

చిలకలగూడ : శుక్రవారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కురిసిన భారీవర్షానికి సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్లలోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. చిలకలగూడ చౌరస్తా, ఆలుగడ్డబావి, మహ్మద్‌గూడ, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో చెట్టుకొమ్మలు విరిగి కరెంట్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు, సిబ్బంది కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఆయా ప్రాంతాల్లో శనివారం పర్యటించి పరిస్థితి సమీక్షించారు. సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడ నాలా పరీవాహక ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్‌తో కలిసి కార్పొరేటర్ సామల హేమ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. నాలాలో చెత్త చెదారాలు వేయవద్దని సూచించారు. ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదని సంబంధిత రెవెన్యూ అధికారులు తెలిపారు.



మహ్మద్‌గూడలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సామల హేమ, ఏఈ కౌశిక్‌లు



మెట్టుగూడలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

రాజీవ్ రహదారి విస్తరణను కుదించండి

కలెక్టర్‌కు బాధితుల వినతి

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్ విస్తరణను 200 అడుగులకు బదులుగా 100 అడుగులకు కుదించాలంటూ రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్తా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి విజ్ఞప్తి చేశారు. రాజీవ్ రహదారి విస్తరణ వల్ల వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయని వివరించారు. ఈ నేపథ్యలో రోడ్డు విస్తరణను కుదిస్తే, బాధితులకు కొంత మేర ఉపశమనం కలుగుతుందని కోరారు. రోడ్డు విస్తరణ ప్రకటనతో పెద్ద సంఖ్యలో దుకాణాలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా భవనాలకు ఆస్తి పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. దుకాణదారులు సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా విద్యుత్ శాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. రోడ్డు విస్తరణ కుదింపు అంశాన్ని సీఎం దృష్టికి వెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆస్తిపన్ను, విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ విషయంలో తక్షణమే అధికారులతో మాట్లాడుతానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసిన రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్

వేగంగా పనులు పూర్తి చేయండి

కార్పొరేటర్ కొంతం దీపిక

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని మనోహర్ థియేటర్ ప్రాంతంలో వరద నీటి పైప్ లైన్ కోసం చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ కొంతం దీపిక అధికారులకు సూచించారు. శనివారం ఆమె రెజిమెంటల్‌బజార్‌లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద నీటి పైప్‌లైన్ మరమ్మతులు చేస్తే గురుద్వార వెనుక వైపు, సంతోషీమాత దేవాలయం చుట్టు పక్కల ప్రాంతాల్లో వరద ముంపు సమస్య తీరుతుందని చెప్పారు.



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

తలసానిని కలిసిన అఖిల భారత చేనేత కళా వైభవం సభ్యులు



ఎమ్మెల్యే తలసానికి వస్త్ర దారాలను అందజేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: శ్రీసీతారాముల కళ్యాణం సందర్భంగా ప్రతి సంవత్సరం వస్త్రాలను సమర్పించడం ఎంతో సంతోషదాయకమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను శనివారం అఖిల భారత చేనేత కళా వైభవం సభ్యులు కలిశారు. వస్త్రాల తయారీ కోసం ఉపయోగించే దారాలను తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు అందజేశారు. ఈ దారాలకు సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భద్రాచలం తీసుకువెళ్లనున్నట్లు వివరించారు. భద్రాచలం ఆలయ ఆవరణలో ఎంతో నిష్టతో ఈ నెల 25వ తేదీ నుంచి రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడుకు వస్త్రాలను మగ్గంపై నేసిన పోచంపల్లి వస్త్రాలను ఏప్రిల్ 6వ తేదీన భద్రాచలంలో నిర్వహించే కళ్యాణంలో శ్రీసీతారాములకు అలంకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ జయరాజ్, సభ్యులు రాపోలు గణేష్, సురేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం అమలు చేయాలి

అడ్డగుట్ట: 'ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంవి ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఏవిఎం. స్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆజాద్ చంద్రశేఖర్ నగర్లోని ప్రభుత్వ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, మౌలిక సదుపాయాలు కూడ సరిగా లేవన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు తరగతికి తగ్గ విద్యా సామర్థ్యాలు అందడం లేదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రవీణ్, రమాదేవి, చింతల లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

గాంధీఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం



మల్లయ్య

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. షాద్‌నగర్ ఎల్లంపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య (47) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యానికి గురైన మల్లయ్యను చికిత్స నిమిత్తం ఈనెల 16న గాంధీఆస్పత్రి అత్యవసర విభాగంలో అడ్మిట్ చేశారు. శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెప్పగా, సర్జరీకి భయపడిన మల్లయ్య ఎమర్జెన్సీ విభాగం నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

గృహిణి అదృశ్యం



శిరీష

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా పరిధిలో ఓ గృహిణి అదృశ్యమైంది. ఎస్ఐ సబిత తెలిపిన మేరకు.. శ్రీకాకుళం జిల్లా సిగడాం మండలం పెంట గ్రామానికి చెందిన ప్రసాద్, పార్వతీపురానికి చెందిన శిరీషలు సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులో కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఐదు నెలల క్రితం విజయవాడ అమ్మవారి ఆలయంలో వీరు పెళ్లి చేసుకున్నారు. ఈ వివాహానికి శిరీష కుటుంబసభ్యులు అంగీకరించలేదు. ఈనెల 20న బయటకు వెళ్లిన శిరీష (19) తిరిగి ఇంటికి చేరలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో భర్త ప్రసాద్ పోలీసులను ఆశ్రయించాడు. మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సబిత తెలిపారు.

మరో ఘటనలో..



అప్పలరాజు

కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. శ్రీనివాసనగర్‌కు చెందిన అప్పలరాజు, సరస్వతిలు భార్యభర్తలు. అప్పలరాజు గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇదే విషయమై తరుచు గొడవ పడుతుండేవారు. శుక్రవారం మధ్యాహ్నం బయటకు వెళ్లిన అప్పలరాజు తిరిగి ఇంటికి చేరలేదు. భార్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

రిటైర్ ఉద్యోగి డబ్బు దోచేసిన సైబర్ నేరగాళ్లు

అమీర్‌పేట: విద్యుత్తు బిల్లు బకాయి ఉందని, కట్టక పోతే కరెంటు కట్ చేస్తామని సైబర్ నేరగాళ్లు రిటైర్డ్ ఉద్యోగి అకౌంట్‌లోని డబ్బు కొట్టేశారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. బీకేగూడలో నివాసముండే 82 ఏళ్ల వృద్ధుడు ఎస్.వెంకట్రావ్ సింగరేణి రిటైర్ ఉద్యోగి. విద్యుత్తు బిల్లు బకాయి ఉందని, చెల్లించకుంటే ఇంటికి కరెంటు సరఫరా నిలిపి వేస్తామంటూ అతడి ఫోన్‌కు మెసేజ్ పెట్టారు. దీంతో ఆందోళ చెందిన వెంకట్రావ్ మెజేస్ పంపిన నంబర్‌కు ఫోన్ చేశాడు. మీరు వెంటనే బిల్లు చెల్లించాలని సూచించి వాట్సాప్‌లో ఓ లింక్ పంపారు. లింక్ క్లిక్ చేయగానే అతడి అకౌంట్‌లో నుండి రూ.57 వేల 485 రూపాయలు మూడు విడతల్లో కాజేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


జెక్‌కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి..

సనత్‌నగర్: జెక్‌కాలనీలో రూ.58 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి సమస్య ప్రతిపాదికన పనులు చేపడుతూ వెళ్తున్నట్లు చెప్పారు. డివిజన్ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామన్నారు. కార్యక్రమంలో జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌చందు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్‌విందు



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావు

చిలకలగూడ : ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. వారాసిగూడ జామ్‌జామ్ ఫంక్షన్‌హాలులో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు

గాంధీలో అందుబాటులోకి వచ్చిన జెరియాట్రిక్ వార్డు

సాక్షి ఎఫెక్ట్..

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ వార్డు ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది. పురుషులు, మహిళల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన విభాగాల్లో శనివారం పలువురు వయోవృద్ధ రోగులను అడ్మిట్ చేసుకుని వైద్య సేవలు అందించారు. రూ. 10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ వార్డు అందుబాటులోకి రాకపోవడంతో 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. పండుటాకులను పట్టించుకోరా..? శీర్షికతో ప్రచురించిన కథనానికి వైద్యమంత్రితో పాటు సంబంధిత ఉన్నతాధికారులు స్పందించారు. ఇటీవల గాంధీఆస్పత్రిని సందర్శించిన మంత్రి దామోదర రాజ నర్సింహా, మెడికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ (డీఎంఈ) నరేందర్‌కుమార్‌లు జెరియాట్రిక్ వార్డును అందుబాటులోకి తేవాలని ఆస్పత్రి పాలనయంత్రాంగానికి ఆదేశించారు. గాంధీ జనరల్ మెడిసిన్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ విభాగానికి నేషనల్ మెడికల్ కౌన్సిల్ నాలుగు పీజీ సీట్లు కేటాయించగా, నలుగురు పీజీ వైద్యులు జాయిన్ అయి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో జెరియాట్రిక్ వార్డు అందుబాటులోకి రావడంతో వయోవృద్ధ రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గాంధీ జెరియాట్రిక్ వార్డులో వైద్యసేవలు పొందుతున్న వయోవృద్ధ రోగులు

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ

కంటోన్మెంట్: రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం మారేడుపల్లి లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కువగా యువత ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. వీటిని నివారించేందుకు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. కార్యక్రమములో కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్. శివ కుమార్, టిటిఐ బేగంపేట ఇన్‌స్పెక్టర్ వి.రాంచందర్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్) వేణుగోపాల్ రెడ్డి

విద్యార్థినుల అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు..

సనత్‌నగర్: జాతీయ అటవీ దినోత్సవం, జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేట మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌కు చెందిన ఐదు యూనిట్లు, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఎకో క్లబ్ విద్యార్థినులు కళాశాల ప్రాంగణం నుంచి బేగంపేట ఫ్లైఓవర్ వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ కొనసాగించారు. కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి ర్యాలీని ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, హలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శరణ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నరసింహులు, డాక్టర్ ప్రసన్న, సరిత, మధుకర్‌రావు, వెంకటేశ్వర్లు, ఎకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ ఉష, డాక్టర్ స్నేహ పాల్గొన్నారు.

చెత్త, బురదతో నిండిపోయిన రోడ్లు

బౌద్ధనగర్: శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బౌద్ధనగర్ డివిజన్‌లోని బస్తీలు చెత్త, బురదతో నిండిపోయాయి. శుక్రవారం రాత్రి వర్షం కురువడంతో న్యూఅశోక్‌నగర్, అల్లాడి రాజ్‌కుమార్‌నగర్, ఎల్ నారాయణ నగర్‌లోని గల్లీలన్నీ బురద, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయింది. దీంతో స్థానిక ప్రజలు కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా లేకపోవడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. గత ఐదేళ్ల నుంచి ఇదే సమస్య తలెత్తుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ బురద మొత్తం తొలగించేందుకు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రజలు ఈ బురదలో ఎలా ఉండాలా అని ప్రశ్నిస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ కంది శైలజ నాయకులు రాజేషలు బస్తీల్లో పర్యటించారు.



బురద మయంగా మారిన రోడ్లు

వికీపీడియా పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొ.సూర్యధనుంజయ్

ఉస్మానియా యూనివర్సిటీ: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.సూర్య ధనుంజయ్ మ్యాడం అభిలాష్ రచించిన వికీపీయా-తెలుగు సాహిత్య వినియోగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ, నిజాం కాలేజీల తెలుగు శాఖ, బోలిచేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల వికీసోర్స్ కార్యశాల ముగిసింది. కార్యక్రమంలో ప్రొ.కమలాకర శర్మ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.కాశీం, బోలిచేతో ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేతి సాయి కిరణ్, రహ్మనుద్దీన్, డా.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతను చాటే ఇఫ్తార్ విందులు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: డివిజన్ పరిధిలోని డీఎస్‌ఎంకాలనీలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు ఎంతో పవిత్రంగా, గొప్పగా రంజాన్ పండుగను జరుపుకుంటారన్నారు. రంజాన్ సందర్భంగా ఏర్పాటుచేసే ఇఫ్తార్ విందు ఐక్యతను చాటుతాయని చెప్పారు. ఈ ఇఫ్తార్ విందులో రహీం, ఖలీల్, జమీర్, నోమాన్, అబ్రార్, ఫాజిల్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

రెక్టల్ కేన్సర్‌పై చికిత్సపై శిక్షణ

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి రేడియేషన్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం రెక్టల్ కేన్సర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలోని ఆడిటోరియంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో రెక్టల్ కేన్సర్‌కు సంబంధించి అంశాలతో పాటు ఈ కేన్సర్ చికిత్సకై ఇటీవల అందుబాటులోకి వచ్చిన టీఎన్‌టీ థెరపీపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కే కృష్ణయ్య మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా హాస్పటల్ ఆర్జించిన విజ్ఞాన సంపదను ఇతరులతో పంచుకోవడమనే కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నామన్నారు. తద్వారా కేన్సర్‌కు సంబంధించిన అంశాలపై వైద్యులకు అవగాహన కల్పించడమే కాకుండా త్వరితగతిన వ్యాధిని మొదట్లోనే గుర్తించే సామర్థ్యాన్ని వైద్యులు కలిగి ఉంటారన్నారు. ఇలా వ్యాధి సోకిన వెంటనే గుర్తించగలిగితే కేన్సర్‌ను పూర్తిగా నయం చేసి రోగి ప్రాణాలను కాపాడడమే కాకుండా దీర్ఘకాలం సాధారణ జీవనాన్ని గడిపేలా చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో రేడియేషన్ అంకాలజీ విభాగం హెచ్‌ఓడీ దిలీప్‌కుమార్, వైద్యులు కౌశర్, అరవింద్, మాధురి, కృష్ణమోహన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.